

త్వరగా సమస్యలు పరిష్కరించండి : జెసి
పిజిఆర్ఎస్‌కు 350 ఫిర్యాదులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు మందిరంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తంగా 350 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. జెసితోపాటు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పాల్గొని ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. గత మూడు వారాలుగా పలమనేరులో జరుగుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని, అందిన వినతులను జిల్లా, మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆర్‌డిఓ భవాని, జెడ్‌పి సీఈవో రవి కుమార్ నాయుడు, పిఆర్ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, డ్వామా పీడీ రవికుమార్, డీపీఓ సుధాకర్ రావు, డిఆర్‌డిఏ, ఐసిడిఎస్ పీడీలు శ్రీదేవి, వెంకటేశ్వరి, ఏపిఎస్ పిడిసిఎల్ ఎస్ఈ ఇస్మాయిల్, ఏడీ సర్వే జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జెసి, ఎమ్మెల్యే

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

- ఏడుగురికి తీవ్రగాయాలు
- గ్రామాన్ని సందర్శించిన జిల్లా అధికారులు



గాయపడిన వారిని 108లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: ఉపాధి హామీ కూలీలపై తేనెటీగలు దాడి చేయడంతో ఆసుపత్రి పాలైన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఏపీవో లలిత తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఏఎం పురం గ్రామపంచాయతీ దిగువ రిపుంజయ రాజపురం, పాపిరెడ్డిపల్లి దళితవాడకు చెందిన 27 మంది గ్రామస్తులు సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఉపాధి హామీ పనుల నిమిత్తం శెట్టి కాలువ పనులు చేస్తూ ముళ్లపొదలను తీస్తుండగా ఒక్కసారిగా 19 మందిపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో కూలీలు కుట్టి అస్వస్థతకు గురైన వారిని వెంటనే ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. 11 మంది ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించగా తీవ్రంగా గాయపడిన ఏడు మంది అంజయ్య, జరాచంద్ర, బాలకృష్ణయ్య, మహేంద్ర, శ్రీదేవి సంపత్, నాగరాజమ్మను మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గ్రామాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారులు

ఉపాధి హామీ కూలీలపై తేనెటీగలు దాడి చేశాయని సమాచారం తెలియడంతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు జిల్లా వైద్యాధికారులు డీఎస్ఓ డాక్టర్ అనిల్ కుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ గిరి, జిల్లా ఎండియోలాజిస్ట్ శ్రీవాణి, ఎంపిహెచ్ఈఓ మోహన్‌శెట్టి దిగువ రిపుంజయ రాజపురం గ్రామాన్ని సందర్శించి బాధితులను పరామర్శించి తగిన చికిత్స అందించారు. ప్రస్తుతం 19 మంది ఉపాధి హామీ కూలీల ఆరోగ్యంగా ఉన్నారని జిల్లా వైద్యాధికారులు తెలిపారు.

కూలీలకు అధికారుల పరామర్శ

తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధి కూలీలను జిల్లా అడిషనల్ పీడీ మల్లికార్జున, ఎంపీడీవో మోహన్ మురళి, ఏపీఓ లలిత పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలను పరామర్శించి స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు. అలాగే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పోటుగారి భాస్కర్, టిడిపి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు గుండయ్య చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధి కూలీలను పరామర్శించి వారికి మెరుగైన వైద్యం అందించాలని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



ఆసుపత్రిలో కూలీలను పరామర్శిస్తున్న ఉపాధి ఏపీడీ

ఏరియా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు
వైద్యసేవలపై ఆరా తీసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ



ప్రజాశక్తి- కుప్పం రూరల్: రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇంచార్జ్ ఆఫీసర్ ఎంటి.కృష్ణ బాబు సోమవారం కుప్పం ఏరియా ఆసుపత్రిని, కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి రోజు వచ్చే రోగుల వివరాలు, వారికి చేస్తున్న రక్త పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుప్పం నియోజకవర్గంలో ప్రారంభించనున్న డిజిటల్ నర్వ్ సెంటర్ ఏర్పాటుకు ఏరియా ఆసుపత్రిలో కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు అందజేశారు. జోనల్ ఇంచార్జ్ ఆఫీసర్ మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన వైద్యసేవలు సకాలంలో అందించాలని, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా నడుచుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గాన్ని ఆరోగ్య రంగంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడంలో భాగంగా టాటా వారితో చేసుకున్న అవగాహన ఒప్పందం మేరకు త్వరలో ప్రారంభించనున్న డిజిటల్ నర్వ్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ఏరియా ఆసుపత్రిలో మందులకు కొరత లేకుండా అత్యవసరమైన మందులను కొనుగోలు చేయాలన్నారు. ఏరియా ఆసుపత్రి నందు అనస్థీషియా డాక్టర్ నియామకంపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వివరించారు. వైద్య సేవలపై ఆరా తీసిన రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఏరియా ఆసుపత్రి తనిఖీలో భాగంగా రోగులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించడంతోపాటు, ఆసుపత్రిలో అవసరానికి తగ్గ మందులు అందుబాటులో ఉన్నాయా అంటూ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ ఏరియా ఆసుపత్రిలో రోజుకి 300 నుండి 350 మంది వరకు రోగులు రావడం జరుగుతోందని, ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్ లతో ప్రతి మాసానికి 30 వేల దాకా పరీక్షలు చేయడం జరుగుతున్నదని, బ్లడ్ స్టోరేజ్ పాయింట్ ఉందని, దీన్ని రెన్యువల్ నిమిత్తం ప్రతిపాదనలు పంపడం జరిగిందని, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను కూడా పంపడం జరిగిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయకుమారి తెలిపారు. సిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పడల్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, డిఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ సుధారాణి, డిసిహెచ్ఎస్ పద్మాంజలి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పరిష్కారంలో అలసత్వం చేయకండి: ఎస్పీ



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో ప్రజల నుంచి 38 ఫిర్యాదులు స్వీకరించినట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఎస్పీతోపాటు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్, ఇంచార్జ్ అడ్మిన్ ఆర్.రాజశేఖర రాజు, డిటిసి డీఎస్పీ రాంబాబు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని ప్రజలు న్యాయం పొందేలా చూడాలలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 38 ఫిర్యాదులు అందాయి, వాటి వివరాలు ఇలా ఉన్నాయి. చీటింగ్ 2, కుటుంబ తగాదాలు 12, వేధింపులు 4, ఇంటి తగాదాలు 4, భర్త వేదింపులు 1, భూ తగాదాలు 13, ఆస్తి తగాదాలు 2. ఉన్నాయి.

పీజీఆర్ఎస్‌కు ఐదు ఫిర్యాదులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ప్రజల నుంచి ఐదు సమస్యలు వచ్చినట్లు నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్ 2, రెవెన్యూ 2, ప్లానింగ్ 1 చొప్పున మొత్తం ఐదు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈ వెంకటరామి రెడ్డి, టీపీవో సుభప్రభ, ఇన్చార్జి మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


పదిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు



ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 2025 సంవత్సరంలో 10వ తరగతిలో 570కి పైగా మార్కులు సాధించిన పోలీసు పిల్లల ప్రతిభను గుర్తించిన జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పట్టణంలోని పోలీస్ గెస్ట్ హౌస్, కాన్ఫరెన్స్ హాల్‌లో పిల్లలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో విలువైన బహుమతులను ప్రదానం చేయడం జరిగింది. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తును రూపుదిద్దేందుకు తీసుకున్న ఒక చిన్న ప్రయత్నంలో భాగమే ఈ బహుమానం ప్రదానం చేయడం అన్నారు. పోలీసుల కుటుంబాలకు బాధ్యతలు గణనీయంగా ఉంటాయని, అయితే, ఆ బిజీ జీవనంలో కూడా పిల్లలు తమ కృషి, పట్టుదలతో అద్భుతమైన ఫలితాలను సాధించడం గర్వకారణమని అన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి మద్దతు ఇవ్వడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ఇది వారి భవిష్యత్తుకు మంచి ప్రేరణ అవుతుందని ఆశిస్తున్నాను అని అన్నారు. పిల్లలతో మాట్లాడి, వారి లక్ష్యాలను తెలుసుకొని, మున్ముందు చదువులో కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. మీ తల్లిదండ్రులు ప్రజల రక్షణ కోసం నిత్యం సేవ చేస్తున్నారని, మీరు కూడా సమాజంలో మంచి మార్పు తీసుకురావడమే వారికి నిజమైన గౌరవం అని, మీ తల్లిదండ్రుల త్యాగాన్ని గుర్తించి, వారి ఆశయాలను నిలబెట్టే విధంగా మెలగాలని హితవు పలికారు. అనంతరం పిల్లలకు భవిష్యత్తు చదువులపై అడిగిన ప్రశ్నలను నివృత్తి చేస్తూ ప్రతి ఒక్కరు తమ లక్ష్యాలను చేదించే దిశగా అడుగులు వేయాలని, పునాది అనేది చాలా ముఖ్యమని కనుక ఇప్పటి నుండే ఒక లక్ష్యం అనుకొని అది చేదించే దిశగా ఇప్పటి నుండే తయారావ్వాలని తెలిపారు. పిల్లల తల్లితండ్రులు మాట్లాడుతూ తమ పిల్లల ప్రతిభను ఇలా గుర్తించటం తమకు ఎంతో ఆనందంగా ఉందని, తమ కుటుంబాలపై జిల్లా ఎస్పీ చూపిన ప్రేమ, శ్రద్ధను తాము ఎప్పటికీ మర్చిపోలేమని అన్నారు. ఇది పిల్లలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని అన్నారు.

రోడ్లపై జంట ఏనుగుల 'హల్‌చల్'..!
వారం రోజులుగా బెంబేలెత్తిస్తున్న గజరాజులు
హడలెత్తిపోతున్న అటవీప్రాంత ప్రజలు



రోడ్డుపై తిరుగుతున్న ఏనుగులు

ప్రజాశక్తి- రామకుప్పం: కౌండిన్య అభయారణ్య పరిధిలోని రామకుప్పం మండలంలోని ననియాల అటవీ సమీపంలో రోడ్లపై జంట ఏనుగులు ఆదివారం రాత్రి హల్‌చల్ చేశాయి. ననియాల సమీపంలోని నర్సరీలో మొక్కలు తొక్కి చిందరవందరగా చేశాయి. ఏనుగుల ట్రాకర్లు టార్చ్ లైట్‌లు వేసుకొని టపాకాయలు, బాణాసంచ పేల్చి అటవీ లోతట్టు ప్రాంతాలకు తరలించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఈ ఏనుగులు గత కొన్ని రోజులుగా పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు ధ్వంసం చేయడమేకాక వ్యవసాయ పరికరాలు కూడా తొక్కి ధ్వంసం చేస్తున్నాయి. గత వారం రోజుల క్రితం నుంచి ననియాల, రామాపురం తండా, నారాయణపురం తండ, సింగసముద్రం, పచ్చరుమాకులపల్లి తదితర అటవీ సమీప పంట పొలాల్లో రాత్రి సమయంలో త్రిష్ట వేస్తున్నాయి. అటవీ సిబ్బంది, ఏనుగుల ట్రాకర్లు తమిళనాడు ప్రాంతానికి మళ్ళించేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. స్థానిక రైతులు తమ పంటపొలాల వద్దకు వెళ్లేందుకు కూడా భయాందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకుని ఏనుగుల కట్టడికి శాశ్వతమైన పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలు క్షమించరు: ఎమ్మెల్యే గురజాల



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి.. మీ ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగిన విధ్వంసం, అక్రమాలు, దౌర్జన్యాలు, అక్రమార్జనలపై బహిరంగ చర్చకు సిద్ధమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సవాల్ చేశారు. కట్టమంచి చెరువులో మట్టి అక్రమంగా తరలిస్తున్నారని, దౌర్జన్యాల పాల్పడుతున్నారని వైసిపి నాయకులు, కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలపై ఎమ్మెల్యే స్పందించారు. మేయర్ అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, సురేంద్ర కుమార్, వసంత కుమార్, కాజూరు బాలాజీ, అశోక్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిత్తూరు నగరపాలక పరిధిలో భూగర్భ జలాలు పెంచడం, కట్టమంచి చెరువు కట్టను పటిష్టం చేసి సుందరీకరణ చేయాలనే మంచి ఉద్దేశంతో పూడికతీత పనులు చేస్తుంటే.. అక్కడేదో అక్రమంగా మట్టి తవ్వుతున్నట్లు కొందరు పని కట్టుకొని ప్రచారం చేయడం తగదన్నారు. ఎన్టీఆర్ జలాశయంలో నీటిని కట్టమంచి చెరువుకు తెప్పించాలనే భావనతో.. అధికారుల సూచన మేరకు ఆరు నెలల క్రితం స్వయంగా జిల్లా కలెక్టర్ స్వయంగా పూడికతీత పనులు ప్రారంభించడం జరిగిందని, వర్షాలు రావడం, చెరువులో నీటి మట్టం కారణంగా పనులు ఆలస్యమైందన్నారు. చెరువులో నీటి సామర్థ్యం పెరగడం వల్ల పరిసర ప్రాంతాల్లోని సుమారు 480 పైగా మున్సిపల్ బోర్లు రీఛార్జ్ అవుతాయని.. ప్రజలకు నీటి సమస్య తీరుతుందనే గొప్ప ఉద్దేశంతో పనులు చేస్తుంటే వాస్తవాలు తెలుసుకోక తప్పుడు సమాచారం ప్రచారం చేయడం దారుణమన్నారు. కట్టమంచి చెరువులో పూడికతీత పనులపై ఇరిగేషన్ శాఖ ఈఈ మురళి కుమార్ ద్వారా మీడియా ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. చిత్తూరు నియోజకవర్గంలో గడిచిన 10 నెలలోనే రూ.56.30 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, పనులు పూర్తి చేసే ప్రారంభోత్సవాలు చేసిన విషయం ప్రజలకు తెలుసునని అన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఎంత అభివృద్ధి చేశారో? ఎన్ని ప్రారంభోత్సవాలు చేశారో ప్రజలకు తెలపాలన్నారు. సమావేశంలో టిడిపి క్లస్టర్ ఇన్చార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ నీలకంఠ నాయుడుకి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అండగా నిలిచారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నీలకంఠ నాయుడుకి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2,76,396 చెక్కును సోమవారం చిత్తూరు ఎంపీ కార్యాలయంలో చూడ చైర్పర్సన్ కటారి హేమలతతో కలిసి అందించారు. ఈసందర్భంగా తెలుగు దేశం పార్టీకి నీలకంఠ నాయుడు అందించిన సేవలు ఎనలేనివని ఎంపి గుర్తు చేశారు. నీలకంఠ నాయుడు కుమారుడు, చిత్తూరు నియోజకవర్గం రూరల్ యూనిట్ ఇన్చార్జ్ శోభన్ బాబు, చిత్తూరు నియోజకవర్గ టీడీపీ కార్యదర్శి బిందు, కుటుంబ సభ్యులు ఎంపికి కృతజ్ఞతలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు.



పోలీస్ మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



హరీష్ బాబుకి చెక్కును అందిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని గుడుపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గత నెల 24న అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ లక్ష్మీ భర్త హరీష్ బాబుకి సోమవారం పోలీసు ఫండ్ నుండి లక్ష రూపాయల చెక్కును చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధిత కుటుంబానికి భరోసా ఇస్తూ, పోలీస్ డిపార్టుమెంట్ తరపున వారికి అన్ని విధాల సహాయం అందిస్తామని తెలిపారు. అదనంగా, మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అందించే అన్ని న్యాయమైన సౌకర్యాలు, ఫలితాలు కూడా సమర్థవంతంగా పొందేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

వేతనాలు రావు..ఉద్యోగ భద్రత లేదు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పేదోడికి కడుపునిండా తిండి..చేతినిండా పని కల్పించడంలో క్షేత్రస్థాయిలో క్షేత్ర సహాయకులదే కీలక పాత్ర. అలాంటి క్షేత్ర సహాయకులు సకాలంలో వేతనాలు రాక.. ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ భద్రత కల్పించి పే స్కేల్ వర్తింప చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఏడాది గడుస్తున్నా ఆ హామీ ఊసే లేకుండా పోయింది. దీంతో ఈనెల 20వ తేదీన క్షేత్ర సహాయకులు ఒక్కరోజు సమ్మె చేసేందుకు సిద్ధమవుతుండడం గమనార్హం.

ఇరవై ఏళ్లుగా ఎదురుచూపులు

కమ్యూనిస్టు పార్టీల పోరాటాల ఫలితంగా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని 2005లో అప్పటి యూపీఏ-1 ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం కూలీలు వలసలు నివారించి ఉన్నచోట ఉపాధి కల్పించడమే. ఈ పథకంలో ప్రతి కుటుంబానికి వందరోజుల పని దినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు. పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ఉన్నత స్థాయి అధికారులను, క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించారు. అయితే పథకం ప్రారంభమై 20 ఏళ్లు గడిచిపోతున్నా అందులో పని చేసే సిబ్బందిని క్రమబద్ధీకరించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. ఈ క్రమంలోనే తిరుపతి జిల్లా వ్యాప్తంగా 819 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే వీరిని కనీసం హెచ్‌ఆర్సీ పరిధిలోకి కూడా ప్రభుత్వం తీసుకురాకపోవడంతో సకాలంలో వేతనాలు రాక, సరైన జీతం అందక, ఉద్యోగ భద్రత లేక సతమతమవుతున్న పరిస్థితి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా క్షేత్ర సహాయకుల మెడపై రాజకీయ వేధింపుల కత్తి వేలాడుతుంది. ఈ లెక్కన ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రాజకీయ వేధింపులతో 50 శాతం మంది క్షేత్ర సహాయకులను తొలగించేస్తున్న పరిస్థితి కనబడుతుంది. మరీ ముఖ్యంగా తూర్పు మండలాల్లోని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో క్షేత్ర సహాయకులపై రాజకీయ వేధింపులు హెచ్చుమీరాయనీ, 20 మంది పొట్టకొట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. తమకు కనీసం ఉద్యోగ భద్రత అయిన కల్పిస్తే రాజకీయ వేధింపులు ఉండవనీ, అందుకోసం 20 ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని క్షేత్ర సహాయకులు వాపోతున్నారు.

రెండు నెలలుగా అందని వేతనాలు

ఫీల్డ్ అసిస్టెంట్లను రెండు కేటగిరీలుగా విభజించి ప్రభుత్వం వేతనాలు అందజేస్తున్నది. మొదటి కేటగిరీలో నెలకు(7 వేలు పని దినాలు) రూ. 10 వేలు, రెండో కేటగిరీలో(2 వేలు పని దినాలు) రూ. 6వేలు ఇస్తున్నారు. కూలీలకు వంద రోజుల పని కల్పించడంతో పాటు గ్రామ పంచాయతీలో జరిగే అభివద్ధి పనులను క్షేత్ర సహాయకులే పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో వివిధ రకాల యాప్లతోపాటు ఏడు రకాల రిజిస్టర్లను చేత సహాయకులు నిర్వహిస్తున్నారు. మండు టెండను సైతం లెక్కచేయకుండా అహర్నిశలు పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు గత రెండు నెలలుగా వేతనాలు అందక కుటుంబాన్ని నడపడం కష్టతరంగా మారింది. కర్ణాటక, కేరళ రాష్ట్రాల మాదిరిగా ఏపీలోనూ క్షేత్ర సహాయకులను క్రమబద్ధీకరించి రూ. 18 వేలు కనీస వేతనాన్ని ఇవ్వాలని వారు కోరుతున్నారు.

బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీలో తెలుగు తమ్ముళ్లకు స్థానం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తెలుగు దేశం పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధితో పనిచేసిన చిత్తూరు పార్లమెంటుకు సంబంధించిన మాల, మాదిగ, యాదవ, కమ్మ, కాపు సామాజిక వర్గాలకు చెందిన తెలుగు తమ్ముళ్లుకు బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీలో కేంద్ర ప్రభుత్వం స్థానం కల్పించింది. టిడిపి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న డి.సునీత, యం.కోదండయ్య, కె.లోకనాథరెడ్డి, కె.సాయి సమీర్ కుమార్, ప్రకాష్ సేవలను గుర్తించిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు వారిని టిఏసి అడ్వైజరీ కమిటీలో సభ్యులుగా నియమించాలని కోరుతూ కేంద్ర సమాచార, సాంకేతిక శాఖామంత్రికి లేఖ రాశారు. చిత్తూరు ఎంపీ సిఫారసును పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీకి ఆమోద ముద్ర వేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. తన విజ్ఞప్తిని మన్నించిన కేంద్ర సమాచార, సాంకేతిక శాఖామంత్రి జ్యోతిరాధిత్య సింధియాకు ఈ సందర్భంగా ఎంపి కృతజ్ఞతలు తెలియజేశారు.



చెక్కులు అందుకున్న ఉత్తమ విద్యార్థులు

ఉత్తమ విద్యార్థులకు చెక్కుల పంపిణీ


ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయం తమిళ శాఖలో 2020 నుండి 2024వ సంవత్సరం వరకు మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులకు పదివేలు నగదు బహుమతి చొప్పున చెక్కులను విసి ఆచార్య దొరైస్వామి సోమవారం అందించారు. 2020 నుంచి 2024వ సంవత్సరం వరకు ర్యాంకులు పొందిన తిరునల్వేలి, నాగపట్నం మధురై, తిరుపత్తూరు లాంటి ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు అదివీర పాండియన్, గోమతి, నందిని, జీవాలకు పదివేలు నగదును చెక్కుగా తన ఛాంబర్‌లో విద్యార్థులకు అందించారు. ఈ పదివేలు ఇచ్చిన దాత రిటైర్డు ఐఎఎస్ అధికారి డాక్టర్ ఎస్ చల్లప్పకు విసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రారు ఆచార్య కిరణ్ కుమార్, తమిళ్ శాఖ ఆచార్యులు పాల్గొన్నారు.



ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడి: ఏడీఏ

ప్రజాశక్తి- పూతలపట్టు : ఆధునిక వ్యవసాయం ద్వారా రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని ఏడీఏ నాగపద్మిణి పేర్కొన్నారు. పూతలపట్టు మండలంలోని పోలవరం ఆర్‌బికెలో రైతులకు ఆధునిక వ్యవసాయంపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్మార్ట్ ఫోన్లలో రైతులకు ఉపయోగపడే యాప్ గురించి వివరించారు. డిజిటల్ పద్ధతిలో ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు. యూట్యూబ్‌లోని వ్యవసాయ రంగానికి సంబంధించిన కొన్ని చానళ్లను రైతులు అనుసరించి అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.



బంగారుపాళ్యం: ఆధునిక వ్యవసాయం సాంకేతికతను అందిపుచ్చుకోవాలని వ్యవసాయ అధికారి చిట్టిబాబు అన్నారు. సోమవారం మండలంలోని నలగాంపల్లి రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులకు గ్రామ ఉద్యానవన శాఖ అధికారిణి కోకిల ఆధ్వర్యంలో సాంకేతికత అందపుచ్చుకునే వ్యవసాయం చేపట్టాలని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ సాంకేతిక వ్యవసాయ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని తద్వారా నాణ్యమైన పంటలను సాగు చేసుకోవచ్చని పాడి పరిశ్రమ , వ్యవసాయం అభివృద్ధి చేసేందుకు యాప్‌ల ద్వారా అవగాహన చేసుకుని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువు రైతులు పాల్గొన్నారు.

తవణంపల్లి: తవణంపల్లి మండల పరిధిలోని మత్యం పంచాయతీ సచివాలయ ఆవరణలో వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు నైపుణ్య శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం హార్టికల్చర్ అసిస్టెంట్ శ్రీధర్ మాట్లాడుతూ వాతావరణ సమాచారం రైతులకు డిజిటల్ పేమెంట్ వాతావరణ, మార్కెట్లో నేడు రేట్లు వివరాలు, యూట్యూబ్ లో వ్యవసాయకు సంబంధించిన విషయాలు తెలుసుకునే విధంగా ప్రభుత్వ పథకాలు గురించి పూర్తి సమాచారం ఎలా తెలుసుకోవాలని రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సాయిల్ కన్జర్వేషన్ ఏవో భారతి రైతు సేవ కేంద్రం ఇన్‌ఛార్జి జ్యోతినాథ్, కళ్యాణ్ వెటర్నరీ అసిస్టెంట్ జాషువా పాల్, రైతులు పాల్గొన్నారు.

నేడు సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు పంపిణీ

ప్రజాశక్తి- శాంతిపురం : మండల రైతులకు సబ్సిడీ వ్యవసాయ పనిముట్లను శాంతిపురం వ్యవసాయ కార్యాలయం వద్ద మంగళ వారం పంపిణీ చేస్తామని ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టరు కంచర్ల శ్రీకాంత్ హాజరవుతారని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఏపీఎస్‌ఆర్‌టిసి స్టేట్ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, టిడిపి మండల అధ్యక్షులు బి విశ్వనాథ్ , మాజీ ఎమ్మెల్సీ జి శ్రీనివాసులు చేతుల మీదుగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శాంతిపురం వ్యవసాయ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మండల స్థాయి ముఖ్య ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. రైతులు, ఏపీ సీఎన్‌ఎఫ్ స్టాఫ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొనాలని వ్యవసాయ అధికారి అపోజి కోరారు.



బోరు మోటారు అమర్చి తాగునీటిని అందించిన పంచాయతీ కార్యదర్శి

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం పేటూరి పంచాయతీ చింపిరెడ్డి పల్లెలో గత కొద్దిరోజులుగా తాగునీటి బోరు మోటారు చెడిపోవడంతో పంచాయతీ కార్యదర్శి లలిత కుమారి స్పందించి సోమవారం నూతన బోరు మోటారును అమర్చారు. ఫలితంగా ప్రజలకుతాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలోని 45 కుటుంబాల వారికి తాగునీటి సమస్య పరిష్కారమైందని ఆమె తెలిపారు.

తొలగని ట్రాఫిక్ కష్టాలు!

- రోడ్డును ఆక్రమిస్తున్న దుకాణదారులు • వాహనాల రాకపోకలకు ఇబ్బందులు • పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలోని వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో వాహన దారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. రోడ్డుకు అటు ఇటు వున్న దుకాణదారులు రహదారిని ఆక్రమిస్తుండడంతో ఆ దారిలో వెళ్లే వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. బస్సులు, ద్విచక్ర వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా వుండే ఈ మార్గం ట్రాఫిక్ సమస్యల కారణంగా పడరాని పాట్లు ఎదుర్కోవాల్సి వస్తోందని ద్విచక్రవాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖాధికారులు ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాల్సి వుంది.

తొలగని ట్రాఫిక్ కష్టాలు

వెదురుకుప్పం మండలంలోని పచ్చికాపల్లం రహదారికి పలు ప్రాంతాల నుండి వాహనాలు, ప్రజలు వచ్చి వెళుతుంటారు.. ప్రధానంగా పలు ప్రాంతాలకు ఇది కూడలి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలతో కిటకిటలాడుతుంది. అటు తమిళనాడు పళ్లిపట్టు నుండి కార్వేటినగరానికి వచ్చి పచ్చికాలపల్లం రోడ్డు మీదుగా తిరుపతికి చేరుకుంటారు. చిత్తూరు నుండి కొత్తపల్లి మిట్ట మీదుగా వెదురుకుప్పం వచ్చి ఈ రహదారి వెంట తిరుపతికి చేరుకుంటారు. పెనుమూరు మండలం నుండి వెదురుకుప్పంకు వచ్చి ఈ రహదారి మీదుగా తిరుపతికి



ట్రాఫిక్ సమస్యతో ప్రమాదకర స్థితిలో ప్రయాణిస్తున్న వాహనాలు

వెళుతుంటారు. ఎస్‌ఆర్‌పురం నుండి వెదురుకుప్పం వచ్చి ఈ రహదారి మీదుగా తిరుపతికి చేరుకుంటారు. ఈ కారణంగా పలు ప్రాంతాలకు ఈ రహదారి వీలుగా వుండటం, తిరుపతికి మరింత సమీపంలో వుండడంతో వాహనదారులు ఈ రోడ్డును ఆశ్రయిస్తున్నారు. ఆర్‌అండ్ బి రహదారి డబుల్ రోడ్డు అయినా వాహనాలు వందల సంఖ్యలో వుండటంతో రద్దీ కారణంగా ట్రాఫిక్ స్తంభించి గంటల తరబడి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో వాహనాలు ఇరుక్కుపోయి వాహనదారులకు గాయాలైన సందర్భాలు కూడా చోటుచేసుకున్నాయి.

రోడ్డును ఆక్రమిస్తున్న దుకాణదారులు

రోడ్డుకు ఇరు వైపులా వున్న దుకాణదారులు రహదారి ముందుకు వస్తుండడంతో రోడ్డు ఇరుకుగా మారింది. ఇటు అటు వచ్చిపోయే వాహనాలు అధిక సంఖ్య లో వుండటంతో ట్రాఫిక్ స్తంభించి అష్టకష్టాలు పడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డును ఆక్రమిస్తున్న దుకాణదారులపై చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాల్సి వుంది.

పట్టించుకోని అధికారులు

పచ్చికాపల్లం రహదారిపై ట్రాఫిక్ కష్టాలు కనిపిస్తు న్నా సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి దీర్ఘకాలిక చర్యలు చేపట్టడం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు ఇప్పటికైనా స్పందించి శాశ్వత చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్య లేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళతాం

రహదారిపై ట్రాఫిక్ కష్టాలను పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళతాం.. పచ్చికాపల్లం రద్దీగా ఉన్న మాట వాస్తవమే. దుకాణ యజమానులు రోజు రోజుకీ ముందుకు వస్తున్నారు. స్థానికులు సమాచారం ఇచ్చారు. విచారించి పై స్థాయి అధికారులకు నివేదిక పంపిస్తాం.. వారి సలహా మేరకు చర్యలు తీసుకుంటాం..

- సాయి భవాని, పంచాయతీ కార్యదర్శి.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించినట్లు పట్టణానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు తెలిపారు. సోమవారం ఆసంఘం సభ్యులు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో వున్న ఓ వ్యక్తి చికిత్స నిమిత్తం ఈనెల 2వతేదీ పలమనేరు ఏరియా ఆస్పత్రికి వచ్చాడని, చికిత్స తీసుకుంటుండగా పరిస్థితి విషమించి ఈ నెల 4వ తేదీ మృతి చెందాడన్నారు. అయితే మృతుడి తరపున వ్యక్తులు ఎవరూ రాకపోవడంతో పలమనేరు సిఐ నరసింహరాజు సూచనల మేరకు ఆ మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించామని తెలిపారు. ఇందులో హెల్పింగ్ హ్యాండ్స్ నాగ శివ, శక్తి, ప్రసాద్, యువరాజ్, నరేంద్ర పాల్గొన్నారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - రామకుప్పం:

మండల పరిధిలోని మిట్టపల్లి వద్దనున్న గిరిజన గురుకుల పాఠశాలలో మూడవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025- 2026 విద్యా సంవత్సరానికి మూడవ తరగతికి ఎస్‌టిలు 32 మంది, ఎస్‌సిలు ఐదుగురు, బీసీలు ఇద్దరు, ఓసి ఒకటి ఖాళీ ఉన్నాయని పేర్కొన్నారు. 4వ తరగతికి 36 మంది, 5వ తరగతిలో 30 మంది, ఆరో తరగతిలో 24 మంది, ఏడవ తరగతిలో ఏడుగురు, ఎనిమిదో తరగతిలో 12 మంది, 9వ తరగతిలో 9 మంది ఖాళీ ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు మే 20 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 8500968128 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సీఎం హామీ అమలు చేయాలి

ప్రజాశక్తి -పుంగనూరు:

ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు ఇచ్చిన హామీని తక్షణం అమలు చేయాలని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు సజ్జాద్ బాష సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉచితబస్సు, నెలవారి రూ.1500, సూపర్ సిక్స్ పథకాలలో చెప్పారని, సూపర్ సిక్స్ పథకాలలో అన్నదాత సుఖీభవ , చదువుకునే పిల్లలకు 15 వేలు వచ్చే నెలలో ఇస్తామని ప్రకటించారన్నారు. ఆ పథకాలతో పాటు (గ్యాస్ సబ్సిడీ వల్ల ప్రజలు లబ్ధి పొందుతున్నారు) అన్నారు. మహిళా పథకాలు ఆలస్యం చేయకుండా అమలు చేయాలన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వానికి మరీ ముఖ్యంగా టిడిపికి మహిళలు పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా మద్దతు ఇచ్చారని, మహానాడులో ప్రకటన చేయాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -పెద్దపంజాణి:

ఈనెల 7వ తేదీ బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఎన్ రెడ్డప్ప అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మండల సర్వసభ్య సమావేశానికి మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో మంచినీటి సమస్య మొదలగు ప్రజా సమస్యలపై సర్వసభ సమావేశంలో చర్చించి సమస్యను పరిష్కరించు కుందామని, మండల అభివృద్ధిపై పూర్తి వివరాలతో ఆయా శాఖల అధికారులు తప్పక హాజరు

వ్యక్తిగత శుభ్రత పాటించాలి: ఎంఎల్ హెచ్‌పి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రుతుక్రమంలో వ్యక్తిగత శుభ్రతలు పాటించాలని ఎంఎల్‌హెచ్‌పి దిలీప్ పేర్కొన్నారు. మండలంలోని తగ్గు వారి పల్లి పంచాయతీ అంగన్‌వాడీ వన్ కేంద్రంలో 'కిశోర బాలికల కిశోర వికాసం' కార్యక్ర మాన్ని అంగన్‌వాడీ కార్యకర్త సూర్య కుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్త వయసులో బాలికలకు వచ్చే మార్పు లు గుర్తించాలని వారికి రుతు క్రమంలో తీసు కోవాల్సిన జాగ్రత్తలు పాటించి వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంఎస్ కే ఉషారాణి, ఆరోగ్య కార్యకర్త రోజారమణి, ఆశ వర్కర్ పుణ్యవతి, పలువురు కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.



వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంఎల్‌హెచ్‌పి

బోదకాలు బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బోదకాలు బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని జిల్లా మలేరియా అధికారి వేణు గోపాల్ అన్నారు. సోమవారం మండలంలోని తుంబ కుప్పం ప్రాథమిక వైద్య అధికారి లోహిత్ చంగల్ రాయలు ఆధ్వర్యంలో బోదకాలు బాధితులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోదకాలు నివారణకు తగిన మందులు వాడాలని క్రమేపి మందులు వాడితే వ్యాధి తగ్గుముఖం పడుతుందని వాటి పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ఒక టబ్, సోప్, మగ్గ్, టవల్, ఆయింటు మెంటులను బోదకాలు రోగులకు పంపిణీ చేశారు. దీనిని ఎలా ఉపయోగించాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ డిపిఎంఓ మణి , సబ్ యూనిట్ ఆఫీసర్స్ శివసుబ్రహ్మణ్యం, రామకృష్ణ, సూపరువైజర్స్ నారాయణ, అముదా, రమాదేవి, హెల్త్ అసిస్టెంట్ శరత్, ఆరోగ్య కార్యకర్త గౌతమి, లేయల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్



మందులు, మాత్రలు పంపిణీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- రైతు సంఘం నాయకుడు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి- పలమనేరు: వర్షాలకు నష్టపోయిన మామిడి రైతులను ఆదుకోవాలని జేసీ విద్యాధరికి రైతు సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. పలమనేరులో మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు విచ్చేసిన జేసీకి ఆయన వినతి పత్రం అందించాడు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఉమాపతి నాయుడు మాట్లాడుతూ నెల రోజులుగా అకాల భారీ వర్షాలు, బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలకు ఉద్యాన పంటలు, 40 శాతం పంట పూర్తిగా నేల పాలైందన్నారు. జిల్లాలో సుమారు 1.12 లక్షల హెక్టార్లలో మామిడిపై సుమారు 60 వేలమంది పైనే మామిడి రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. సంవత్సరం పొడవునా తోటల దున్నకాలు, ఎరువులు మందులు పిచికారీ అనేక రకాల పెట్టుబడులకు వేలకు వేలు అప్పులుచేసి పెట్టిన పెట్టు బడులు కూడా రావడం లేదు ఇప్పటి వరకు మామిడి పంటలకు నష్టపరిహారం ఏ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. పంటలకు ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే విపత్తుల కారణంగా పంటలపై ప్రతి ఏటా మే నెలలో కురిసే అకాల భారీ వర్షాలు బలమైన ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన భారీ వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బ తిని నేల పాలవుతున్నాయి రైతులు పండించిన పంటలన్నీ చేతికి అందక పూర్తిగా నష్టపోతు న్నార న్నారు. గత ప్రభుత్వంలోనూ మామిడి రైతులకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అయినా మామిడి రైతులను ఆదుకుంటుందని అనుకుంటే ఏమీ లేదన్నారు. మామిడి తోటలే కాకుండా ఉద్యాన పంటలు అన్ని పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. ఈ విషయాన్ని హార్టికల్చర్ వారు మామిడి తోటలను సందర్శించడానికి వచ్చినప్పుడు వచ్చినపుడు ఆదుకుంటా మని తెలిపారని, ప్రస్తుతం ఈసారి మామిడి రైతులకు ఇన్సూరెన్స్ కట్టుకోవాలని ఒక ఎకరానికి 17.50 రూపా యలు చొప్పున చాలా మంది ఇన్సూరెన్స్ చేసుకున్నా రని, నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. గత జీవో స్థానంలో నూతన జీవో ప్రవేశపెట్టా లన్నారు. బాధిత రైతులను ఆదుకోవాలని డిమాండు చేశారు.



జేసీకి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకుడు

ఘనంగా రామచంద్ర నాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -వి కోట : మండల కేంద్రమైన వీకోటలో పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు రామచంద్ర నాయుడు జన్మదిన వేడుకలను అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ కూడలిలో సోమవారం ఉదయం రామచంద్ర నాయుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుండి పార్టీ అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి కట్టుబడి సర్పంచ్ నుండి ఎంపీపీ, జడ్పిటిసి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వంటి వివిధ పదవులతో ప్రజా సేవలో తనదైన స్థానాన్ని సంపాదించుకున్న సీనియర్ నాయకుడని కొని యాడారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు ,పండ్లు పంచిపెట్టారు. పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాంబాబు, ఈశ్వర్ గౌడ్ ,నాగభూషణం, విశ్వనాథ్, భక్తవత్సలం, సోము, సతీష్ నాయుడు, షన్ముగం , ధీరజ్, శబరీష్, గుణ,సుబ్రహ్మణ్యం సెట్టియర్, పొట్టు భాస్కర్, నాసిర్, సురేంద్ర తోపాటు పెద్ద ఎత్తున నేతలు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



రామచంద్రనాయుడుకి కేక్ తినిపిస్తున్న అభిమానులు

క్రైం న్యూస్



మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి -శాంతిపురం : మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి సోమవారం కుప్పం కోర్టు రిమాండు విధించినట్లు పోలీసులు తెలిపారు. శాంతిపురం మండలం పరిధిలోని గుంజార్లపల్లి గ్రామానికి చెందిన బిఎం మురళీ మోహన్ సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో రాళ్లబూదుగూరు గ్రామం, కుప్పం-కెజిఎఫ్ రోడ్డులో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ నరేష్ వాహన తనిఖీల్లో అతన్ని పట్టుకున్నారు. తర్వాత అతన్ని రాళ్లబూదుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షించగా, మద్యం తాగినట్లు వైద్యులు ధృవీకరించారు. అనంతరం ఈ కేసులో అతడిని కుప్పంలోని స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వరుణ్ తేజ ముందు హాజరు పరచగా, అతనికి రూ. రెండువేల జరిమానా, 14 రోజుల రిమాండ్ విధించారు. జరిమానా చెల్లించకపోవడంతో నిందితుడిని 14 రోజుల పాటు రిమాండ్‌కు పంపించారని తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ

ఒకరికి గాయాలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. బాధితుడి సోదరుడు ఫిర్యాదు మేరకు.. బైరెడ్డిపల్లె నుంచి చిక్కనపల్లె గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతున్న కె రవిని పలమనేరు నుండి కుప్పం వైపు వెళుతున్న లారీ ఢీకొంది. దీంతో రవి కిందపడడంతో కుడికాలు కింది భాగంలో, మోకాలు, నడుం వద్ద తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం బంధువులు బైరెడ్డిపల్లి పిహెచ్‌సికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కుప్పం పిఇఎస్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

13న వాహనాల బహిరంగ వేలం

ప్రజాశక్తి -తవణంపల్లి:

తవణంపల్లి మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను తవణంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగవేలం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. పోలీస్ స్టేషన్ లో వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన ఒక ఈచర్ లారీ, ఆరు మోటార్ సైకిళ్లకు చిత్తూరు జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చిత్తూర్ ఎస్ కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో ఈనెల 13 వతేదీ బహిరంగ వేళం తవణంపల్లి పోలీస్ స్టేషన్ లో వేలం నిర్వహిస్తామని నిర్వహి స్తామని ఎస్‌ఐ ఏ చిరంజీవి తెలిపారు. ఈ వేలంలో పాల్గొనా లనుకున్న వ్యక్తులు తవణంపల్లి పోలీస్ స్టేషన్‌లో అదే రోజు ఉదయం 10 గంటలకు సంబంధించిన రుసుం చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. ఇతర వివరాలకు తవణంపల్లి పోలీస్ స్టేషను సంప్రదించాలని అయన కోరారు.



పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బంది

జోరుగా పారిశుధ్యం

ప్రజాశక్తి-సోమల:

సోమల మండలం ఆవుల పల్లెలో సోమవారం ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శి మణికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా, మండల స్థాయి అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని పరిసరాల పరిశుభ్రత, పిచ్చి మొక్కలు తొలగించాలని ఆదేశించడంతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి మురుగునీటి కాలువలను శుభ్రం చేయడం వంటివి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా మహాభారత ఉత్సవాలు


ప్రజాశక్తి- వెదురుకుప్పం :

వెదురు కుప్పం మండలం నల్లవెంగనపల్లి లో జరుగుతున్న వార్షిక మహాభారత మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం అమ్మవారిని ఊరేగించారు. పాతగుంట గ్రామానికి చెందిన చొక్కాలింగారెడ్డి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జెగిని విజయ ముని కృష్ణారెడ్డి, డీలర్ మస్తాన్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్‌ఎంయుఏ సభ్యులు గత కొంతకాలంగా పోరాటం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే నల్ల బ్యాడ్జీలు ధరించి రెండు రోజులపాటు నిరసన వ్యక్తం చేస్తూనే విధులకు హాజరవ్వడం, ఆర్టీసీ ప్రాంగణంలో మరో రెండు రోజులపాటు నిరసన చేపట్టడం, సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి ఎస్ మునిరత్నంకు వినతి పత్రం అందించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అయినా తమ సమస్యలకు పరిష్కార మార్గం కనిపించకపోవడంతో నేడు ఎన్ఎం యుఏ సభ్యులు కుప్పం డిపో అధ్యక్షులు ఎస్ ఎం స్వామి, కుప్పం డిపో సంయుక్త కార్యదర్శి జి మునెప్పల ఆధ్వర్యంలో తమ సమస్యలకు పరిష్కారం కోరుతూ తహశీలారు చిట్టిబాబుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు మోహన్ మాట్లాడుతూ ఉద్యోగుల పనిష్మెంటు విషయంలో 01/2019 సర్క్యులర్‌ను అమలు అయ్యేలా చూడాలని, ప్రయాణికులు ఇచ్చిన డబ్బులకు టికెట్స్ తీసుకొనే బాధ్యత ప్రయాణికులే తీసుకునేలా బాధ్యత తీసుకోవాలన్నారు. గ్యారేజ్‌లో సరిపడ సిబ్బందిని నియమించారు. వారికి అవసరమైన విడిభాగాలు, పనిముట్లు అందించాలని, ప్రత్యేక పరిస్థితులలో మహిళా సిబ్బందికి అవసరమైన సెలవులు ఇవ్వాలని, అవుట్సోర్సింగ్ సిబ్బందికి, ఆల్ కాల్ డ్రైవర్స్ కు కనీస వేతనం కల్పించాలని, ముఖ్యంగా సంస్థ పరంగా కొత్త బస్సులను కొనుగోలు చేయాలని, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు కనీస పెన్షన్ అందించడంతోపాటు, ప్రభుత్వ పథకాలు అయిన ఆరోగ్యశ్రీ, వృద్ధాప్య పెన్షన్ అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి టివి కుమార్, డిపో నాయకులు రాజా, ఎం సి నాయక్, బాల బ్రహ్మం, విజయ్ కుమార్, బాలకృష్ణ,గోవిందరాజులు, మొగిలీస్వరయ్య, మురళి కృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

వైస్ ఛైర్మన్‌కు ఉద్యోగుల వినతి



ఆర్‌టిసి వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కీలపట్ల కోనేటిరాయస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని కీల పట్ల శ్రీ కోనేటిరాయ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాల పూజలు నిర్వహించి ధ్వజపటాన్ని, చక్రతాల్వారిని, శ్రీదేవి, భూదేవి సమేత కోనేటిరాయ స్వామిని తిరిచి వాహనంపై కొలువు తీర్చి కీలపట్ల గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఖాద్రి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో వైఖానస ఆగమన శాస్త్ర ప్రకారం ధ్వజారోహణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంటు రాజకుమార్ , టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర పాల్గొన్నారు.